
ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్ : 4.40 (గురువారం)

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 3 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262


ఉష్ణోగ్రత | గరిష్ఠం 40.5 | కనిష్ఠం 24.2

లోక్‌సభ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ సీట్లను కైవసం చేసుకుని, లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని ఆదిపత్యాన్ని కొనసాగించేందుకు అధికార కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. గత వైభవాన్ని చాటుకునేందుకు బీఆర్ఎస్, తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈనేపథ్యంలో అన్ని ప్రధాన పార్టీలు కూడా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మద్దతు ఇవ్వరూ!

- పార్టీల్లోని సీనియర్ నేతలతో అభ్యర్థుల సంప్రదింపులు
- ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై సమాలోచనలు
- సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు



నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్‌నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డిని, బీఆర్ఎస్ తరఫున కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థులుగా ఆయా పార్టీలు ప్రకటించాయి. భువనగిరి స్థానంలో కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్, సీపీఎం తరఫున ఎండీ జహంగీర్‌ను ప్రకటించాయి. అయితే ఎంపీ అభ్యర్థులు మాత్రం ఎన్నికల్లో సీనియర్ నేతలతోపాటు పార్టీలోని కీలకనేతల మద్దతు కోసం తిప్పలుపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ అభ్యర్థులు జిల్లాలోని మంత్రులు, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జీలను, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సంప్రదిస్తున్నారు. వారిని కలిసి ఎన్నికల్లో తమకు పూర్తి సహకారాన్ని అందించాలని, గెలుపు వ్యూహాలపై సమాలోచనలు కూడా చేస్తున్నారు. పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కృషి చేయాలని కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనాల జోరు



ప్రధాన పార్టీ అభ్యర్థులు సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు సాధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కులాలవారీగా గర్జనలకు సిద్ధమవుతున్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం(రంగారెడ్డిజిల్లా), జనగాం(జనగాం జిల్లా) నియోజకవర్గాలు ఉంటాయి.నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలున్నాయి. బీజేపీ ఎస్సీ సామాజిక వర్గాల ఓటర్లను సాధించేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి, పార్లమెంట్ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సైతం ఆత్మీయ సమ్మేళనాలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. నియోజకవర్గాల వారీగా పెద్దఎత్తున సమావేశాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు త్వరలోనే తేదీలను ఖరారు చేయనుంది. ఇక బీఆర్ఎస్ ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు నిర్వహించగా, ప్రత్యేకంగా సామాజికవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. అన్నిప్రధాన పార్టీలు కూడా మెజార్టీ ఓటర్లపై దృష్టి సారించాయి. మెజార్టీ సామాజిక వర్గాలు తమవైపే ఉన్నారన్నభావనలో పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఎవరివైపు మొగ్గుచూపుతారో అన్నది వేచిచూడాల్సిందే.

సమన్వయంతో పనిచేస్తే విజయం సునాయాసం

ఎన్నికలకు నెలరోజుల ముందుగానే పార్టీల్లోని టికెట్ ఆశించిన నేతలతోపాటు అసంతృప్త నేతలను కూడా కలిసి వారి మద్దతు కోరుతున్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు టికెట్ నిర్ణయం జరిగిందని, ఈఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తే విజయం సునాయాసంగా ఉంటుందని విన్నవించుకుంటున్నారు.ఇక బీజేపీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహిస్తోంది. నిత్యం ఏదో ఒక నియోజకవర్గంలో పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లను తమవైపు తిప్పుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. అవసరమైతే జాతీయస్థాయి నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. ఇక బీఆర్ఎస్ అధిష్టానం నియోజకవర్గాలవారీగా సమావేశాలు పూర్తిచేసింది. ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని అసెంబ్లీల నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు పర్యటించారు. పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మెజార్టీ స్థానాల గెలుపు కోసం అన్ని పార్టీలు కూడా సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

క్రీడలతో మానసికోల్లాసం

- పోచంపల్లిలో ముగిసిన క్రికెట్ టోర్నీ



బహుమతి ప్రదానం చేస్తున్న తడక రమేష్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 2: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు తడక రమేష్ అన్నారు. పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ విజేతలకు మంగళవారం బహుమతి ప్రదానంలో పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. విజేతలకు నగదుతోపాటు షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బోగ భానుమతి విష్ణు, పద్మశాలి యువజన సంఘం గౌరవ సలహాదారులు వనం వెంకటేశం, గౌరవాధ్యక్షులు సూరపల్లి రాము, అధ్యక్షుడు గంజి యుగేందర్, ప్రతినిధులు రుద్ర చందు, ఆడెపు అరవింద్, ఆటిపాముల ధర్మేందర్, సూరపల్లి జగదీష్, మదినాల మహేష్, ఏలె శివశంకర్, చిలువేరు ఉదయ్, మూషం శ్రీనివాస్, బింగి భాస్కర్, సాయితేజ పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' జవాబుపత్రాల మూల్యాంకనం

- 1.45 లక్షల జవాబు పత్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ



దివ్యబాల హైస్కూల్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 2: పదో తరగతి వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం నేటినుంచి రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో ప్రారంభం కానుంది. ఈ నెల 11వ తేదీ వరకు జరిగే మూల్యాంకనం కోసం భువనగిరి పట్టణ శివారులోని దివ్యబాల హైస్కూల్‌లో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 1.45 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. అయితే ఈ సంఖ్యలో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉండొచ్చని అధికారులు అంటున్నారు. అయితే గత సంవత్సరం 123 లక్షల జవాబుపత్రాలను ఇక్కడ మూల్యాంకనం చేశారు. అనగా గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 22వేల జవాబుపత్రాల మూల్యాంకనం పెరగనుంది.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం కోసం దివ్యాబాల హైస్కూల్‌లో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్ ప్రతీ రోజు 40 జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఒక్కో జవాబు పత్రానికి మూల్యాంకనం భృతిగా రూ.10విద్యాశాఖ చెల్లిస్తుంది. జిల్లాలోని కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే మూల్యాంకనం విధులకు ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత సంవత్సరం మూల్యాంకన భృతి నాలుగు రోజుల క్రితం అందడంపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఈ సంవత్సరం మాత్రం మూల్యాంకనం చివరి రోజే భృతిని అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మూల్యాంకనం కేంద్రం వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు సహా ఎవరి సెల్‌ఫోన్లను మూల్యాంకనం కేంద్రంలోకి అనుమతించరు. మూల్యాంకనం మార్పులను ఎప్పటికప్పుడు విద్యాశాఖ ప్రత్యేక పోర్టర్‌లో పొందుపరుస్తారు.

మూల్యాంకన విధుల్లో 910 మంది

1.45లక్షల జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో సుమారు 910మంది పాల్గొననున్నారు.క్యాంపు అధికారిగా డీఈవో డాక్టర్ కె.నారాయణ రెడ్డి వ్యవహరిస్తారు. అలాగే డిప్యూటీక్యాంపు (అడ్మిన్) అధికారిగా-1, డిప్యూటీ క్యాంపు (స్ట్రాంగ్ రూం) అధికారి-1, అసిస్టెంట్ క్యాంపు అధికారులు-8,చీఫ్ ఎగ్జామినర్లు-100, అసిస్టెంట్ ఎగ్జామినర్లు-600, స్పెషల్ అసిస్టెంట్లు-200మంది.అలాగే మరి కొంతమంది ఇతర పనుల్లో సాయపడనున్నారు. ఉన్నతాధికారులు రోజువారిగా మూల్యాంకనం కేంద్రాన్ని పరిశీలించి పర్యవేక్షించనున్నారు.

పోలింగ్ శాతాన్ని పెంచాలి



భువనగిరిలో 5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ జెండగే

కలెక్టర్ హనుమంతు కే జండగే
ఉత్సాహంగా 5కే రన్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల్లో 90 శాతం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతాన్ని అధిగమించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆకాంక్షించారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన స్వీప్ ఓటర్ అవగాహన '5కే రన్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వేయడం అందరి సామాజిక బాధ్యత అన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు సజావుగా ఓటు వేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 85 ఏళ్ల దాటిన వయోవృద్ధులు, 40శాతం పైబడి వైకల్యమున్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటువేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటులేని 18 ఏళ్ల దాటిన వారంతా వెంటనే ఓటు హక్కుకోసం నమోదు చేసుకోవాలన్నారు. ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నిలు జరిగేలా ఎన్నికల సంఘం పూర్తిఏర్పాట్లు చేసిందన్నారు. అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌నకు వచ్చే ఫిర్యాదులను 90 నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. టోల్‌ఫ్రీ నెం.1950 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ గంగాధర్, స్వీప్ నోడల్ అధికారి ఎంఏ కృష్ణన్, జడ్పీ సీఈవో శోభారాణి, డీఈవో డాక్టర్ కె.నారాయణ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల్ రెడ్డి పాల్గొన్నారు.



పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వహించాలి

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈవీఎం, వాటి పనితీరు, పోలింగ్ సామగ్రి, పోలింగ్‌బూత్ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. టెండర్, ఛాలెంజ్ ఓటు తీరును వివరించారు. మాక్ పోలింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో అమరేందర్, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలి : తరుణ్ జోషి.

పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన రాచకొండ కమిషనరేట్ యాదాద్రి జోన్ క్రైం రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో నిబంధనలను పాటించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసు అధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు ఎన్నికల విధులపై నిర్దిష్టమైన సూచనలు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా తరలించే డబ్బు, మద్యం తదితర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల సరఫరా నియంత్రణకు జోన్ పరిధిలో ఎనిమిది స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవసరమైన ప్రతీ చోట చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరంతరం ప్రజలతో మమేకం కావాలన్నారు. నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలన్నారు. వృద్ధులు, మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించరాదన్నారు. యాదాద్రి జోన్ పరిధిలో నమోదైన పోక్సో, అట్రాసిటీ కేసులు, ఇతర పెండింగ్ కేసులపై పోలీస్టేషన్లవారీగా సమీక్షించారు. పలు అంశాలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీసీపీ ఎం.రాజేష్ చంద్ర, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు ఆపై స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ తరుణ్ జోషి

అంతర్జాతీయ క్రీడాకారుడిని అభినందించిన కమిషనర్

అంతర్జాతీయ టోర్నీలలో ప్రతిభ చూపుతున్న యాదాద్రి జోన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఆంబోజు అనిల్ కుమార్‌ను తరుణ్ జోషి భువనగిరిలో అభినందించారు. ఫిబ్రవరి 22 నుంచి 25 వరకు థాయిలాండ్‌లో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2024లో అనిల్ ఒక బంగారు, 3 కాంస్య పతకాలు సాధించడాన్ని కమిషనర్ ప్రశంసించారు.

రూ.25వేల పరిహారం అందజేయాలి

బీఆర్ఎస్ నేతల డిమాండ్



ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరచారికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 2: ఎండిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వడంతోపాటు గిట్టుబాటు ధరకు మద్దతుగా బోనస్ చెల్లించాలని రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కొల్పుల అమరేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. నాగేశ్వరచారికి బీఆర్ఎస్ తరఫున వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పంట నష్టం కింద ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని, రైతుకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500బోనస్ అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, జడ్పీటీసీ బీరుమల్లయ్య, భూదాన్‌పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎంవీ కిరణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దు

ఏడీఏ వెంకటేశ్వర్లు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

మోత్కూరు, ఏప్రిల్ 2: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి, నష్టపోవద్దని ఆలేరు ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని పాలడుగు గ్రామంలో శ్రీమత్స్యగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, తాలు, మట్టి లేకుండా శుభ్రంచేసి కేంద్రాలకు తేవాలన్నారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ.2203, సాధారణ రకం ధాన్యానికి రూ.2183 ధర చెల్లిస్తారన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో కె.స్వప్న, ఏఈవో జె.సైదులు, సంఘం అధ్యక్షుడు వల్లపు సైదులు, ఉపాధ్యక్షురాలు యాస మాధవి, ముక్కామల మత్స్యగిరి, సంఘం సీఈవో నర్సింహాచారి, వెండి యాదగిరి, అంతటి బక్కయ్య, సుదర్శన్, బద్దం లక్ష్మారెడ్డి, వెంకన్న ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించి మద్దతు ధర పొందాలని ఆలేరు ఏడీఏ వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నాబార్డ్, వ్యవసాయ శాఖ, గ్రామ వికాస సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో దీప్తి, మార్కెట్ కార్యదర్శి పద్మజ, గ్రామ వికాస్ సంస్థ డైరెక్టర్ వస్పరి స్వామి, శివకుమార్ రాకేష్, ప్రశాంత్, సిద్దులు, దివ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలి

చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి



సమావేశంలో మాట్లాడుతున్న మహతి వైష్ణవి

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 2: కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించాలని, ఇందుకోసం బార్ అసోసియేషన్ కృషి చేయాలని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మంగళవారం బార్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లపై కక్షిదారులకు సరైన అవగాహన కల్పించి రాజీమార్గంలో కేసులను పరిష్కరించాలన్నారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఊడుగు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా తాడూరి పరమేష్, ప్రధాన కార్యదర్శిగా రాపోలు వేణు కుమార్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బాల్యం వెంకటాచలపతి, ఎలమోని శ్రీనివాస్, వాకిటి నర్సింహారెడ్డి, పాల పరమేష్, కానుగుల వెంకటయ్య, చెన్నూరి రాధాకిషన్ రావు, ఏపీపీ ఖాజా మోహినొద్దీన్ పాల్గొన్నారు.

దైవ చింతనతోనే శాంతి, సామరస్యం

దైవ చింతనతో ప్రతిఒక్కరిలో శాంతి, సామరస్యం నెలకొంటాయని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. అనవసరమైన సమస్యలతో ఎంతో విలువైన సమయాన్ని వృధా చేసుకోకూడదని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు.

ఏఎన్ఎంలు ఉప కేంద్రాలకు రావాలి

సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి



గుట్ట మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 2: ఏఎన్ఎంలు ప్రాథమిక ఉపకేంద్రాలకు విధిగా హాజరు కావాలని సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక కేంద్రం మెడికల్ ఆఫీసర్ పావనికి సీపీఎం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు హాజరైతేనే ఆశావర్కర్లు కూడా రెగ్యులర్‌గా వస్తామంటున్నారన్నారు. గుట్ట ప్రాథమిక కేంద్రం పరిధిలో మొత్తం 9 సబ్ సెంటర్లు ఉండగా అందులో ఆశావర్కర్లు మొత్తం 46 మంది, 18 మంది ఏఎన్ఎంలు ఉండాల్సి ఉంది. అందులో ప్రస్తుతం 16 మంది ఏఎన్ఎంలు మాత్రమే ఉన్నారు. ఏఎన్ఎంలు ప్రతీరోజూ సబ్ సెంటర్లకు రావడంలేదన్నారు. దీంతో ఉప కేంద్రాలకు ప్రతీరోజు ఆశా వర్కర్లు మాత్రమే వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. రోగులు వస్తే వారికి కావాల్సిన మందులు ఇవ్వాలని ఏఎన్ఎంలు ఆదేశాలు జారీ చేస్తున్నారని, ఆశా వర్కర్లకు మందులపై సరైన అవగాహన లేక మందులు ఇస్తే ఏదైనా ప్రమాదం జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలు తప్పకుండా రావాలని మెడికల్ ఆఫీసర్‌కు వినతిత్రపం అందజేస్తుంటే యాదగిరిపల్లికి చెందిన మెడికల్ ఆఫీసర్ హరీష్ అడ్డుకొని ఆశా వర్కర్లతో వాదనకు దిగారని తెలిపారు. చివరకు వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు , నాయకులు పాల్గొన్నారు.

జడ్పీ సమావేశాలు వాయిదా

చైర్మన్‌తోపాటు సభ్యుల గైర్హాజరు



జడ్పీ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 2: కోరం లేక జడ్పీస్థాయీ సంఘం సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు సీఈవో ఎస్.శోభారాణి ప్రకటించారు. మంగళవారం జడ్పీకార్యాలయంలో జరగాల్సిన నాలుగు స్థాయీ సంఘాల సమావేశాలు కోరం లేక వాయిదా పడ్డాయి. ఉదయం 10.30కు 1వ, 7వ (ఆర్థిక, పనులు), మధ్యాహ్నం 12 గంటలకు 2వ (గ్రామీణాభివృద్ధి), మధ్యాహ్నం 2.30గంటలకు 4వ (విద్య, వైద్యం) స్థాయీ సంఘం సమావేశాలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన జరగాల్సి ఉంది. ఆయా స్థాయీసంఘాల సమావేశాలకు జడ్పీ చైర్మన్‌తోపాటు సభ్యులు గైర్హాజరయ్యారు. అన్నిస్థాయీ సంఘాల సమావేశాలకు సంబంధిత జిల్లాస్థాయి అధికారులు హాజరైనప్పటికీ సభ్యుల గైర్హాజరుతో కోరం లేని కారణంగా సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు సీఈవో ప్రకటించారు. సమావేశాల నిర్వహణపై తర్వాత తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ ఈఈలు వెంకటేశ్వర్లు, శంకరయ్య, ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ శ్రీనివాసాచారి, డీవైఎస్‌వో లక్ష్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హరీష్, డీఎల్‌పీవో బి.శ్రీకాంత్‌రెడ్డి, డీసీహెచ్‌వో చిన్నా నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ వై.పాపారావు పాల్గొన్నారు.

గతేడాది టోల్‌గేట్ చార్జీలే.. యథాతథం

- చార్జీల పెంపునకు రెండు నెలల విరామం
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం



పంతంగి టోల్‌గేటు వద్ద కొత్త రేట్ల పట్టిక

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 513.10 అడుగులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 513.10 అడుగులు(136.9932 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 4,881 క్యూసెక్కుల నీటిని, జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.

టోల్‌గేట్లలో గతేడాది చార్జీలే..

● చార్జీల పెంపునకు రెండు నెలల విరామం
● ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశాలతో గతేడాది చార్జీలను కొనసాగిస్తున్న జీఎంఆర్

చౌటుప్పల్ / కేతేపల్లి, ఏప్రిల్ 2 : ప్రతీ ఏడాది ఏప్రిల్ 1 ఒకటవ తేదీ నుంచి పెరిగే టోల్‌చార్జీల బాదుడు రెండు నెలలు వాయిదా పడింది. జాతీయ రహదారుల సంస్థ(నాయ్) సూచన మేరకు గతేడాది టోల్‌చార్జీలను కొనసాగించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65)పై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని చిల్లకల్లు కూడా టోల్‌ప్లాజా ఉంది. ప్రతీ ఏడాది మాదిరే ఏప్రిల్ 1 నుంచి పెరిగిన చార్జీలను ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి(ఏప్రిల్ 1) వరకు


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

సుమారు 20 గంటల పాటు వసూలు చేశారు. అనంతరం నాయ్ సూచన మేరకు పాతచార్జీలను రెండు నెలల పాటు కొనసాగిస్తూ హైవే డెవలపర్స్ ఆర్గనైజేషన్‌కు నాయ్ మౌలిక ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జీఎంఆర్ సంస్థ పాతచార్జీలను వసూలు చేస్తున్నారు. గత సంవత్సరం నుంచి వసూలు చేసిన టోల్‌చార్జీలను సోమవారం రాత్రి (ఏప్రిల్1)అమల్లోకి తెచ్చినట్లు కొర్లపహాడ్ టోల్‌ప్లాజా మేనేజర్ శివకుమార్ తెలిపారు.

వాహనాలు రకాలు	పంతంగి టోల్‌ప్లాజా వద్ద		కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద	
	సింగిల్	రిటర్న్ జర్నీతో కలిపి	సింగిల్	రిటర్న్ జర్నీతో కలిపి
కారు, జీపు, వ్యాన్	రూ.90	రూ.135	రూ.125	రూ.190
లైట్ కమర్షియల్ వెహికల్	రూ.140	రూ.210	రూ.200	రూ.300
బస్, ట్రక్‌లకు	రూ.290	రూ.435	రూ.415	రూ.625
హెవీ కన్‌స్ట్రక్షన్ వాహనానికి	రూ.450	రూ.675	రూ.645	రూ.970
పెద్ద వాహనానికి సింగిల్	రూ.560	రూ.845	రూ.805	రూ.1,210

ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో 2 వేల ఏళ్ల నాటి నాణేలు



ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో మార్చి 29న తవ్వకాల్లో బయటపడ్డ సీసపు నాణేలు, గతంలో తవ్వకాల్లో బయటపడ్డ బౌద్ధుల కాలం నాటి ప్రతిమలు, స్తంభాలు, ఇతర వస్తువులు

మోత్కూరు, ఏప్రిల్ 2 : సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో నిర్వహిస్తున్న తవ్వకాల్లో తాజాగా మార్చి 29న 2 వేల ఏళ్ల కిందటి సీసపు నాణేలు బయటపడ్డాయి. ఇవి శాతవాహనుల సామంతులైన మహాతలవరుల కాలం నాటి నాణేలుగా భావిస్తున్నారు. క్రీస్తుశకం రెండో శతాబ్దంలో ఇక్కడ బౌద్ధధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని చెబుతారు. ఫణిగిరి కొండపై సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఈ బౌద్ధక్షేత్రం విస్తరించి ఉంది. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన బౌద్ధక్షేత్రాల్లో ఫణిగిరి క్షేత్రం ఒకటి. అమరావతి, నాగార్జునకొండ బౌద్ధక్షేత్రాల కంటే ఈ క్షేత్రం గొప్పదంటారు. ఇక్కడ ఇక్ష్వాకులు 11 ఏళ్ల పరిపాలించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. 1941లో అప్పటి నైజాం ప్రభువు కాలంలో ఈ క్షేత్రంలో తొలిసారి తవ్వకాలు జరిపారంటున్నారు. ఆ తర్వాత రాష్ట్ర పురావస్తు శాఖ వారు 2001 నుంచి 2007 వరకు ఒకసారి 2015లోనూ ఫణిగిరి గుట్టపై తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో మహాస్థూపం, చైత్య గుహలు, స్థూపాలు, గృహలు, శిలా మండపాలు, బుద్ధుడి పాదాలు, బుద్ధుడి ప్రతిమలు, పాత్రలు, చిహ్నాలు, జాతక కథలు, సిద్ధార్థ గౌతమి జీవిత కథలు, అపురూపంగా మల్చిన శిల్పాలు, శాతవాహులు, ఇక్ష్వాకులు, మహాతరవరుల నాణాలు, బొమ్మలు బయటపడ్డాయి. కుండలు, కూజలు, కప్పులు, టైల్స్, బౌద్ధుల గదులు బయటపడ్డాయి. ఇందులో 32 గదులు ఉన్నాయి. బుద్ధుడి పాదాలు, బుద్ధుడి వ్యక్తిత్వానికి ప్రతీకలుగా భావించే అష్టమంగళం, చిహ్నాలు, మర్మచక్రం, మిథునం, అంకుశం, యజ్ఞాశం, ఖడ్గం, సప్తి, పిరస్సం గుర్తులు లభించాయి. ప్రపంచంలో ఎక్కడా లేని బుద్ధుడి తలపాగా ఇక్కడ లభ్యమైందని చెబుతారు. గతంలో ఇక్కడ బుద్ధవనం ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. తరచుగా దేశ, విదేశాల బౌద్ధ మత గురువులు, పురావస్తు పరిశోధకులు, అధ్యయనకారులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. మార్చి 11న ఈ బౌద్ధ క్షేత్రంలో మ్యూజియం ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతీ హోళీకేరీ, కలెక్టర్ వెంకటరావు పాల్గొన్నారు. ఆ రోజు నుంచి పురావస్తు శాఖ అధికారులు ఇక్కడ మరోసారి తవ్వకాలు చేపట్టారు. రోజూ 65 నుంచి 75 మంది కూలీలు తవ్వకాల్లో పాల్గొంటున్నారు. ఆదివారం సెలవు రోజు తప్ప మిగతా రోజుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ తవ్వకాల్లో గత నెల 29న 2 వేల ఏళ్ల కిందటి 3,700 సీసపు నాణేలు బయటపడ్డాయి. వాటిని కూలీల సమక్షంలోనే లెక్కించి భద్రపర్చినట్లు తెలిసింది. పురావస్తు శాఖ డైరెక్టర్ వచ్చి పరిశీలించిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

రూ.40కోట్లతో బుద్ధవనంలో అభివృద్ధి పనులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టును రూ.40కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ ఎండీ. రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టులో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా బుద్ధవనం ప్రాజెక్టులో రూ.25కోట్లతో డిజిటల్ మ్యూజియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనులకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మరో రూ.15కోట్ల వ్యయంతో కొనసాగుతున్న షాపింగ్ కాంప్లెక్స్, సోలార్ పవర్ ప్లాంట్, సెంట్రలైజ్డ్ మ్యూజియం, వ్యూ పాయింట్, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం హిల్‌కాలనీ విజయ్‌విహార్ వెనుక వైపు ఉన్న లాంచీ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సుదన్‌రెడ్డి, బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ శివనాగిరెడ్డి, జీఎం ఉపేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ నజీశ్, విజయ్‌విహార్ మేనేజర్ ఎల్లస్వామి, సూపర్‌వైజర్ విష్ణు తదితరులు ఉన్నారు.


బుద్ధవనంలో రూ.25కోట్లతో నిర్మించే డిజిటల్ మ్యూజియం స్థలాన్ని పరిశీలిస్తున్న రమేశ్‌నాయుడు

గుట్టలో క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 2: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 35,29,018 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.


ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మానవతావాది 'దాసి' సుదర్శన్

మిర్యాలగూడ, ఏప్రిల్ 2 : మానవతావాది, వామపక్ష భావజాలంతో కడదాక ముందుకు సాగిన విలక్షణ, చిత్రకారుడు 'దాసి' సుదర్శన్ అని వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం పిట్టంపల్లి సుదర్శన్ అలియాస్ 'దాసి' సుదర్శన్ పార్థివదేహాన్ని సందర్శించి వివిధ సంఘాల నేతలు, శేషు మిత్రమండలి సభ్యులు నివాళులర్పించారు. సుదర్శన్ సతీమణి స్వతంత్రను పరామర్శించారు. బంధు, మిత్రుల అశ్రునయనాల మధ్య మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, కార్టూనిస్ట్ శంకర్, నర్సిం తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విభిన్న రంగాల్లో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించారని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పుస్తక రచయితగా, కార్టూనిస్టుగా, జర్నలిస్ట్‌గా, ఫొటోగ్రాఫర్‌గా, ఉపన్యాసకుడిగా, చిత్రకారుడిగా, గాయకుడిగా ఆయన ప్రతిభను కనబరిచారని గుర్తు చేశారు. పిట్టంపల్లి సుదర్శన్ దాసి చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసి జాతీయ అవార్డు పొంది 'దాసి' సుదర్శన్‌గా ప్రజలకు మరింత చేరువయ్యారని అన్నారు. పౌరాణిక రంగస్థల నటుడు మట్టయ్య కుమారుడిగా సుదర్శన్ కళలను పుణికి పుచ్చుకున్నాడని అన్నారు. 'అల' అనే కళావేదిక స్థాపించి సాహిత్య సభలను నిర్వహించారని తెలిపారు. కాగా సుదర్శన్‌కు సంతానం లేకపోవడంతో అతడి అన్న కుమారుడు చక్రవర్తి సుదర్శన్ చితికి నిప్పంటించారు. అంత్యక్రియల్లో మానవహక్కుల వేదిక నాయకులు పీ సుబ్బారావు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, నాయకులు యోగానంద్ భిక్షమయ్య, కస్తూరి ప్రభాకర్, రచయితలు వేణు సంకోజు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, మధుసూదన్, తిరుమల్‌రావు, ఎలికట్టె శంకర్‌రావు కార్టూనిస్టులు విఘ్నేశ్వరాచారీ(చిత్ర), వడ్డేపల్లి వెంకటేశ్, గుండు శ్రీనివాస్, ఇనుగుర్తి విజయ్, వివిధ సంఘాల నేతలు కిరణ్మయి, జ్వాల వెంకటేశ్వర్లు, చెరుకు సుధాకర్, రవి, రామోహన్‌రాజు, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాశ్, పంకజ్, జాడి రాజు, ప్రసాద్, వివిధ పత్రికల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.


సుదర్శన్ పార్థివదేహం ఎదుట నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనాథగా రిక్షా కార్మికుడి మృతి

తిరుమలగిరి, ఏప్రిల్ 2: నాలుగేళ్ల క్రితం భార్య మృతి చెందింది... రెండేళ్ల క్రితం కుమార్తెకు వివాహమై అత్తవారింటికి వెళ్లింది. రెక్కల కష్టం మీద రిక్షా తొక్కుతూ ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇంట్లోనే కిందపడగా, సకాలంలో ఆయనను ఆసుపత్రికి తరలించేవారులేక ప్రాణాలు కోల్పోయాడు. మూడు రోజుల క్రితం ఈ ఘటన జరిగినా ఎవరూ గుర్తించలేదు. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల ఇళ్లవారు వెళ్లి చూడటంతో ఈ ఘటన వెలుగు చూసింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుమలగిరిలోని ఆదర్శనగర్ 3వ వార్డుకు చెందిన పులుసు యాదగిరి(50) రిక్షా కార్మికుడు. భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందగా, కుమార్తె రేణుక రెండేళ్ల క్రితం తిరుమలగిరికి చెందిన వెంకన్నను ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో యాదగిరి తన చిన్న ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆ వీధిలో నాలుగైదు ఇళ్లు మాత్రమే ఉంటాయి. అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉండే కుమార్తె అప్పుడప్పుడు తండ్రి వద్దకు వచ్చి బాగోగులు చూసుకుంటుంది. భారీకాయుడైన యాదగిరి ఇంట్లో కిందపడటంతో తల పగిలి రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించేవారులేక మృతి చెందాడు. మంగళవారం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు యాదగిరి ఇంట్లోకి వెళ్లి చూడగా కింద పడి మృతిచెందినట్లుగా గుర్తించి కుమార్తెకు సమాచారమిచ్చారు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తున్నందున దగ్గరకు ఎవరూ వెళ్లలేదు. యాదగిరి మృతదేహాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, కార్మికులు అంజి, సాల్మన్, చేతరాములు దుప్పటిలో చుట్టి మునిసిపల్ వాహనంలో శ్మశానవాటికకు తరలించారు. కుమార్తె, అల్లుడు సమక్షంలో మునిసిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతను తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టి మానవత్వం చాటారు. యాదగిరి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియల క్రతువు నిర్వహించింది. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి మునిసిపల్ సిబ్బందికి రూ.5వేల విలువైన పీపీఈ కిట్లు, కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.


తిరుమలగిరిలోని ఆదర్శనగర్‌లో యాదగిరి మృతదేహాన్ని ఆటోలోకి ఎక్కిస్తున్న మునిసిపల్ సిబ్బంది, యాదగిరి (ఫైల్ ఫొటో)

రూ.21.58 లక్షల నగదు పట్టివేత

వలిగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల రూరల్, కోదాడ రూరల్, నాగారం, తిప్పర్తి, ఏప్రిల్ 2: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 21,58,069 రూపాయల నగదును మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గర్దాసు శివకుమార్ తన బైక్‌పై రూ.5,04,569 నగదును తరలిస్తుండగా వలిగొండ మండలం నాగారం మధిర గ్రామం కమ్మగూడెం వద్ద తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో అమ్మనబోలు గ్రామానికి చెందిన వ్యాపారి తన బైక్‌పై సుంకి వెంకటేశ్వర్లు రూ.9.50లక్షల నగదును తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. చిట్యాల మండలం వట్టిమర్తి స్టేజీ వద్ద నిర్వహించిన తనిఖీల్లో హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తున్న వాహనంలో ఎలాంటి ఆధారాలు లేని రూ.2.39లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.55 వేల నగదు పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో పత్తి వ్యాపారి షేక్ సైదా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటొరెడ్డి తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో బొలెరో వాహనంలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గోపాలాపురం గ్రామానికి చెందిన ఎల్లబోయిన బుచ్చయ్య నుంచి రూ.80వేలు, అదేవిధంగా జనగాంకు చెందిన శ్రీను వాహనంలో రూ.79,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద నిర్వహించిన తనిఖీలలో రూ.1.50లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

300 కిలోల బెల్లం స్వాధీనం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 2 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లో నల్లగొండ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సూర్యాపేట డీటీఎఫ్ అధికారులు దాడులు చేశారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో దాడుల వివరాలను జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ వివరించారు. చింతలపాలెం మండల కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వచేసిన 300 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటి యజమాని పరారీలో ఉన్నాడని, అదే గ్రామానికి చెందిన చిత్తలూరి లక్ష్మీ సారా విక్రయిస్తుండగా ఆమె నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మఠంపల్లి మండలంలోని అవిరేనికుంటతండా, సుల్తాన్‌పూర్‌తండా, రామచంద్రాపురం తండాల్లో దాచిన సుమారు 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. మఠంపల్లి మండలం కాలువపల్లి తండాకు చెందిన బాణోతు కోటా, బాణోతు సోముడు చౌటపల్లి గ్రామానికి 10 లీటర్ల సారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బాణోతు సోముడు పరారీ కాగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నాగార్జునరెడ్డి, రాకేష్, మల్లయ్య, శంకర్, జగన్మోహన్‌రెడ్డి, రవి, నరేష్, నాగరాజు, రుక్మారెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ, ఏప్రిల్ 2 : నల్లగొండ జిల్లా దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. జాల్‌తండా, గోనబోయినపల్లి, టి.గౌరారం, జేత్యతండా, పద్మట్‌పల్లితండా, మేగ్యాతండాలలో దాడులు నిర్వహించి 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురుని అరెస్ట్ చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 18 లీటర్ల నాటుసారా, 18 కేజీల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సాగర్ మాజీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సీజ్



భగత్ క్యాంప్ కార్యాలయాన్ని సీజ్ చేస్తున్న అధికారులు, 14వ మైలురాయి వద్ద పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ క్యాంపు కార్యాలయాన్ని ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఇంట్లో ఉన్న సామాన్లన్నింటినీ మునిసిపల్ వాహనాల్లో ఎన్నెస్పీ కార్యాలయానికి తరలించారు. అనంతరం గేటుకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ విషయంపై ఎన్నెస్పీ ఈఈ మల్లికార్జున్‌రావును వివరణ కోరగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఇంతకాలం నివాసమున్న భవనం తన సొంత ఇల్లు కాదని, క్యాంపు కార్యాలయంగా తమ రికార్డుల్లో ఉందని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి క్యాంపు కార్యాలయాన్ని అప్పగించేందుకు పలుమార్లు భగత్‌ను క్యాంప్ ఆఫీస్‌ను ఖాళీ చేయాలని నోటీసులు పంపినా ఆయన పట్టించుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయాన్ని సీజ్ చేసి గేటుకు తాళం వేశామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దవూర తహసీల్దార్ పావని సరోజ, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, జేఈ భిక్షమయ్య, సీఐ వీసన్న, ఎస్‌ఐ సంపత్ ఉన్నారు. కాగా హైదరాబాద్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌ను ఫోన్‌లో సంప్రదించగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎన్నెస్పీ అధికారులు తాను నివాసం ఉంటున్న ఇంటిని సీజ్ చేశారని అన్నారు. ఈ విషయంలో చట్టపరంగా ముందుకు వెళ్తానని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా

సాగర్‌హిల్‌కాలనీలోని తన క్యాంప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భరత్ హైదరాబాద్ నుంచి హుటాహుటిన సాగర్‌కు బయలుదేరారు. ఆయన్ను మార్గమధ్యలో పోలీసులు 14వ మైలురాయి వద్ద అరెస్టు చేశారు. అరెస్టు విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు హిల్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పొదిలి శ్రీను, భానునాయక్, మల్లికార్జునతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తుండటంతోనే

నల్లగొండ, ఏప్రిల్ 2: ప్రభుత్వం కేటాయించిన అధికారిక క్యాంపు కార్యాలయాన్ని సకాలంలో ఖాళీ చేయకపోవడమే కాకుండా, లోకసభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నప్పటికీ క్యాంపు కార్యాలయాన్ని రాజకీయ కార్యక్రమాలకు వినియోగించుకున్నందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు హిల్ కాలనీలోని ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయాన్ని తక్షణమే సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల మైదానంలో జీవాల దొడ్లు

- నలుగురికి పడిపోయిన విద్యార్థుల సంఖ్య
- పాఠశాల గదులను ఆక్రమించేందుకు కొందరి యత్నం
- దాతరుపల్లి మధిరగ్రామంలోని పాఠశాల దుస్థితి



తరగతి గది పక్కనే జీవాల దొడ్డి ఏర్పాటు చేసిన దృశ్యం

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 2: విద్యా కేంద్రాలుగా విలసిల్ల వలసిన ప్రాథమిక పాఠశాల భవనాలు జీవాలదొడ్లతో కనిపిస్తున్న దీన స్థితి. విద్యార్థులు పాఠాలు చదవాల్సిన తరగతి గదులు.. ఆటలు ఆడాల్సిన మైదానంలో గొర్రెల, మేకలు, పశువులు సంచరిస్తున్నాయి. ఇది యాదగిరిగుట్ట మండలంలోని దాతరుపల్లి మధిర గ్రామమైన గొల్లగుడిసెల గ్రామంలోని పాఠశాల పరిస్థితి. యాదగిరిగుట్ట మండలంలో 32 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు ఉండగా అందులో ఇప్పటి వరకు నాలుగు పాఠశాలు మూతపడ్డాయి. 28 పాఠశాలల్లో ప్రస్తుతం 1800మంది విద్యార్థులకు 84 మంది ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తున్నారు. దాతరుపల్లి మధిర గ్రామంలో గొల్లగుడిసెల గ్రామంలో ప్రాథమిక పాఠశాలను 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయగా, మాజీ సర్పంచ్ బైరగాని పుల్లయ్య పాఠశాలకు ఎకరం స్థలాన్ని కేటాయించారు. 15 సంవత్సరాలపాటు విద్యార్థులకు విద్యాభ్యాసం కొనసాగింది. గత జూలై నెలలో పూర్తిగా విద్యార్థుల సంఖ్య నలుగురికి పడిపోయింది. పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలలకు వెళ్లారు. పాఠశాల నిర్వహిస్తున్న చుట్టు పక్కల, మైదానంలో అదే గ్రామానికి చెందిన కొంతమంది గొర్రెలు, మేకలు, పశువుల దొడ్లను ఏర్పాటుచేశారు. ఇలాంటి పరిస్థితిలో పాఠశాలకు విద్యార్థులు రావడం పూర్తిగా మానేశారు. ఇదే అదునుగా పాఠశాల మైదానం, పాఠశాల గదులను పూర్తిగా కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకుని, పాఠశాలను తిరిగి తెరిపించి, పాఠశాలకు కేటాయించిన స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాఠశాల స్థలాన్ని కాపాడాలి



గొల్లగుడిసెల ప్రాథమిక పాఠశాలకు ఎకరం స్థలం కేటాయించిన మాట వాస్తమే. ప్రస్తుతం పాఠశాల మూతపడటంతో చుట్టు పక్కల వారు స్థలం కబ్జాచేసే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి పాఠశాల స్థలాన్ని కాపాడాలి.

-బైరగాని పుల్లయ్యగౌడ్, మాజీ సర్పంచ్, దాతరుపల్లి

పాఠశాలను పునఃప్రారంభించాలి

గత జూలై మాసంలో మూతబడిన పాఠశాలను తిరిగి పునఃప్రారంభించాలి. తమ పిల్లలు ఇతర గ్రామాలకు వెళ్లి చదువుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే విద్యా సంవత్సరం గ్రామం నుంచి తప్పకుండా తమ పిల్లను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తాం.

- గ్రామస్థులు, దాతరుపల్లి

పాఠశాల ఆస్తులకు కాపాడుతాం



పాఠశాల ఆస్తులను కాపాడే బాధ్యత ఎంపీడీవోది. గొల్లగుడిసెల పాఠశాల మైదానం కబ్జాకు గురికాకుండా ఎంపీడీవో దృష్టికి తీసుకెళతాను. పాఠశాల ఆవరణలో ఉన్న దొడ్లను తొలగించి స్థలం కాపాడుతాను.

-కృష్ణయ్య, ఎంఈవో, యాదగిరిగుట్ట

నిరుపయోగంగా అతిథి గృహం



గుండాల మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం

గుండాల, ఏప్రిల్ 2: గుండాల మండల కేంద్రంలోని అతిథి గృహం నిర్వహణ లోపంతో నిరూపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుంటోంది. గుండాల మండలం మారుమూల మండలం కావడంతో మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అతిథి గృహంలో బస చేసేందుకు 17 సంవత్సరాల క్రితం మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి రూ.10లక్షలు వెచ్చించి నిర్మింపజేశారు. ప్రారంభంలో ఐదు సంవత్సరాల వరకు నిర్వహణ చేపట్టిన అధికారులు రాను రాను దానిపై అశ్రద్ధ వహించడంతో నిరూపయోగంగా మారింది. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిరూపయోగంగా మారిన అతిథి గృహాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అతిథి గృహాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి



ప్రజాప్రతినిధులు, అధికారులు అవసరం కోసం ఏర్పాటు చేసిన అతిథి గృహాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి. అతిథి గృహం ఉపయోగంలోకి వచ్చినట్లయితే వివిధ పనుల నిమిత్తం మండలానికి వచ్చిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎంతో మేలు జరుగుతుంది.

-బింగి నగేశ్, మాసాన్‌పల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా

గుండాల మండల కేంద్రంలోని అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవడానికి తగిన నిధులు సమకూర్చడం కోసం అధికారుల దృష్టికి తీసుకువెళతా. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

-శ్రీనివాస్, పీఆర్ ఏఈ, గుండాల మండలం

సీఎంను విమర్శించే స్థాయి మహేశ్వర్‌రెడ్డికి లేదు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 2: బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని, అతడికి సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం యాదగిరిగుట్టలోని తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వర్‌రెడ్డి తన స్థాయిని మరిచి సీఎం రేవంత్‌రెడ్డిపై, మంత్రులపై అనాలోచితంగా మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీకి కమీషన్లు తీసుకునే సంస్కృతి ఉందని, కర్ణాటకలో కమీషన్లు ఎక్కువ శాతం తీసుకోవడంతో ఆ పార్టీ చిత్తుగా ఓడిపోయిందని అన్నారు. అవినీతి ఆరోపణలున్న గాలి జనార్ధన్‌రెడ్డి, యడ్యూరప్పను బీజేపీలోకి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను బెదిరించి రూ.ఆరు వేల కోట్ల విలువైన బాండ్లను బీజేపీ ఎలా సేకరించిందో ఆ భాగోతాన్ని సుప్రీంకోర్టు బట్టబయలు చేసిందని అన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిపై పోరాటం కాంగ్రెస్ పార్టీయే సేసిందని, రాజకీయ ఉనికి కాపాడుకోవడానికి మహేశ్వర్‌రెడ్డి రోజుకో డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. మహేశ్వర్‌రెడ్డి పార్టీ శాసన సభ పక్షనేతగా బీజేపీ వాళ్లే గుర్తించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. సీఎంను మరో సారి విమర్శిస్తే ఊరుకొనే ప్రసక్తిలేదని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ చీర శ్రీశైలం, మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధా హేమేందర్‌గౌడ్, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశంయాదవ్, బిట్లు సరోజహరీష్, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్, దుబ్బాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న పాశం భాస్కర్

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 2: కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రి కావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం బీజేపీ మునిసిపాలిటీ, మండల పోలింగ్ బూత్ అధ్యక్షులు, మండల బీజేపీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాశం భాస్కర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం దేశ సమైక్యత- సమగ్రత కోసం ఆలోచన చేసి స్వచ్ఛందంగా బీజేపీకి మద్దతు పలుకుతున్నారని, మోదీ అధికారంలోకి రావాలని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. భువనగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను ఆదరించాలని ఆయన కోరారు. బీజేపీ మునిసిపల్ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం, నాయకులు జి. సురేందర్ రెడ్డి, జంగయ్య, బిక్షమాచారి, దిండు భాస్కర్, మునగాల తిరుపతి రెడ్డి, కాయితీ రమేష్, బి.సాయిలు, దూర్కు కృష్ణ, మల్లేశం పాల్గొన్నారు. అనంతరం సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మోత్కూరు : బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని బీజేపీ మునిసిపల్ అధ్యక్షుడు పోచం సోమయ్య అన్నారు. మంగళవారం మోత్కూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, చేకూరి మల్లేశం, మరాటి అంజయ్య, ముత్తినేని తిరుమలేష్ పాల్గొన్నారు.

బీజేపీకి సంపూర్ణ మద్దతు: ఎమ్మార్పీఎస్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణమాదిగ అన్నారు. భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 3 ఎస్సీ, పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నప్పటికీ ఎస్సీ వర్గానికి చెందిన మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షుడుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఒక్కమాదిగకు కూడా టికెట్ ఇవ్వకుండా మోసగిస్తే బీజేపీ మాత్రం ఇద్దరికి టికెట్లు ఇచ్చి గౌరవించిందన్నారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద శంకర్, మాదిగ, ఇటుకల దేవేందర్, కుమార స్వామి, ఎరుగు శ్రీశైలం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

ఎస్సీ సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణా సంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. భువనగిరిలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరెకంటి మొగులయ్య, పార్లమెంట్ ఇంచార్జీ మాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బుగ్గ దేవేందర్, గోలి ప్రభాకర్ పాల్గొన్నారు.

పాపన్న స్ఫూర్తితో ఐక్యంగా పోరాడాలి



చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గీతకార్మికులు



మోత్కూరులో పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: బహుజనులు సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో రాజ్యాధికారం కోసం ఐక్యంగా పోరాడాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వేర్వేరుగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటాలు, విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. రాజుల నిరంకుశ పాలనను ఎదిరించి బహుజనులను ఏకం చేసి పోరాడి గోల్కొండతో పాటు 32 కోటలను జయించి, బహుజన రాజ్యాధికారాన్ని స్థాపించిన గొప్ప వీరుడు సర్వాయి పాపన్న వారు కొనియాడారు. ప్రజాస్వామ్యంలో బహుజనులు చీలిపోయి రాజ్యాధికారానికి దూరమవుతున్నారన్నారు. బహుజనులు ఐక్య పోరాటాల ద్వారానే తమ హక్కులు సాధించుకోవాలన్నారు. మోత్కూరులో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో గౌడ సంఘం మండల అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, కార్యనిర్వాహక అధ్యక్షుడు తండ సత్తయ్య, రాచకొండ బాలరాజు, గనగాని కృష్ణ, బుర్ర శ్రీనివాస్, బాబుచారి పాల్గొన్నారు. భువనగిరిలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో సర్వాయి పాపన్న సంఘం జాతీయ అధ్యక్షుడు జైహింద్‌గౌడ్, బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని సర్వాయి పాపన్న విగ్రహానికి మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, మండల కాంగ్రెస్ ఇంచార్జ్ పబ్బు రాజు పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు, ఆత్మకూరు(ఎం), వలిగొండ, రాజాపేట, బీబీనగర్ మండలాల్లో నిర్వహించారు. రామన్నపేటలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు, మల్లేశం, గీతపని వారల సంఘం నాయకులు బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య పాల్గొన్నారు. బొమ్మలరామారంలో పండ్లను పంపిణీ చేశారు.

పోరాడే నాయకుడినే ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు రంగారెడ్డి

చౌటుప్పల్ టౌన్/ భూదాన్‌పోచంపల్లి/ రామన్నపేట/ ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 2: ప్రజల పక్షాన ప్రతినిత్యం పోరాడే నాయకుడినే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించాలని, మతోన్మాద బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కోరారు. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం పార్టీ మునుగోడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన అన్నారు. ప్రజా ఉద్యమాలతో నిరంతరం ప్రజల మధ్యన ఉండే జహంగీర్‌ను ఆదరించి, సమస్యలను పరిష్కరించుకోవాలని, పేదవాడిని పార్లమెంట్ కు పంపించాలని ఆయన అన్నారు. సమావేశంలో అభ్యర్థి జహంగీర్, సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్, నాయకులు దోనూరు నర్సిరెడ్డి, బండ శ్రీశైలం, బూరుగు కృష్ణారెడ్డి, ఎండి. పాషా, ఎ.వెంకటేశ్, ఎ.రామేశ్వరి, జి.సైదులు, నర్సింహ, అరుణ్ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గత పాలకుల వైఫల్యంతోనే అభివృద్ధి లేమి: జహంగీర్

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోలేదని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల దివాలాకోరుతనం వల్లనే ఈ ప్రాంతం వెనుకబడిందన్నారు. ఈ ప్రాంతంలోని దేవాదుల ప్రాజెక్టు, బస్వాపురం ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నాయని విమర్శించారు. ఒకప్పటి జీవనది మూసీ నేడు కాలుష్య కాసారంగా మారిందన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలకు ప్రభుత్వం 58వేల కోట్ల నిధులు కేటాయించాలని, కేవలం రూ. 10 కోట్లతో సుందరీకరణ పేరిట కేటాయించి చేతులెత్తేస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే తగిన నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి పగిల్ల లింగారెడ్డి, బట్టుపల్లి అనూరాధ, మండల సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మండల నాయకులు కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, లాలయ్య పాల్గొన్నారు. రామన్నపేటలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు మేక అశోకొరెడ్డి, ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, గాదె నరేందర్, గన్నెబోయిన విజయభాస్కర్, పిట్టల శ్రీనివాస్, పల్లె సత్యం, అప్పం సురేందర్ పాల్గొన్నారు. ఆత్మకూరు(ఎం)లో నాయకులు బొలెగాని జయరాములు, నాయకుడు రచ్చ గోవర్ధన్, వేముల బిక్షం మాట్లాడారు.

సంక్షిప్తంగా..

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో పోలెపాక సత్తమ్మ అనే కాంగ్రెస్ కార్యకర్త అనారోగ్యంతో మృతిచెందింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి తోపాటు పలువురు నాయకులు సత్తమ్మ మృతదేహనికి పూలమాలవేసి నివాళు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5000 ల ఆర్థిక సాయం అందజేశారు.

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు బొబ్బల ఇంద్రారెడ్డిని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మంగళవారం ఇంద్రారెడ్డికి నియామక పత్రం అందజేశారు.

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక పాతగుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు, గాంధీనగర్‌లో రోడ్లు పూర్తిగా శిథిలం కావడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాటికి వెంటనే మరమతులు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. బీజేపీ నాయకులు బందారపు మల్లేశంగౌడ్, బోడ సురేష్, నల్ల వాసుదేవరెడ్డి, దొమ్మాట ప్రభాకర్, భాను, శ్రీశైలం, శివ, శ్రీకాంత్, నంద శివ, కర్రె శ్యామ్, పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: గ్రామస్థులకు మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి నీటి సరఫరా అయ్యే వాటర్ ట్యాంకులు, బోర్లను, పైపులైన్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్, రాములు వాటర్ మెన్ ఉన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని నమాత్‌పల్లికి చెందిన మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావుగౌడ్, ఉపాధ్యక్షుడు ముప్పిడి సైదులుగౌడ్ లక్ష్మీనారాయణగౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ నియమాక పత్రం అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి : భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 5న నిర్వహించనున్న సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ప్రసాదం విష్ణు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమాశంలో ఆయన మాట్లాడారు.

భువనగిరి టౌన్: భువనగిరి స్వర్ణగిరి ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా తారాల ఉపేందర్, ఉపాధ్యక్షులుగా గోపరాజు గణేష్, బింగి శివ, ప్రధాన కార్యదర్శిగా మర్రి శివ, సహాయ కార్యదర్శులుగా మాటూరి దుర్గా, బోడ స్వామి, కోశాధికారిగా నరేందర్ ఎన్నికయ్యారు.

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 5 సెల్‌ఫోన్లతోపాటు రూ.10వేలు నగదు, మూడు సెట్ల పేక కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అరెస్టు అయిన వారిలో నక్క శ్రీనివాస్‌రెడ్డి, బాసాల బాసాల బాలక్రిష్ణ, చెక్క నరేష్, గోరుకంటి శివ, రావుల యాదగిరి, కాసుల బాలకృష్ణ, చెక్క నరేష్ ఉన్నారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

భువనగిరి టౌన్ : బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మోర్చ జిల్లా అధ్యక్షుడు దుర్గాపతి లక్ష్మీనారాయణగౌడ్ మంగళవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా తండా రమేష్‌గౌడ్, మల్యాల వేణుమాధవ్, బైరగోని మహేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా దాసోజు భిక్షమాచారి, కామిటికారి కృష్ణ, కార్యదర్శులుగా వసులాది రాంచందర్, శ్రవణ్‌కు నియామకపత్రాలు అందజేశారు.

భూదాన్ పోచంపల్లి: ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ కొరకు టెట్ తప్పనిసరి అయినట్లయితే ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన సమావేశంలో చావా రవి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, మిర్యాల దామోదర్, మెతుకు సైదులు, ప్రభాకర్, అంజయ్య, సూరం జ్ఞానేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి, అచ్చయ్య పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 2: సీఎం రేవంతరెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన రమావత్ రవినాయక్‌కు ప్లాస్టిక్ చేయి వేయించేందుకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 2లక్షల ఎల్‌వోసీ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, మండల కమిటీ ఉపాధ్యక్షుడు చింతల శ్రీశైలం, నాయకులు మండల వెంకటేశం, బంటు గణేష్, గంగదేవి కొండల్, మండల నర్సింహ, రమావత్ శ్రీనివాస్, రమావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

12, 13తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



సమావేశంలో మట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 2: ఎస్ఎఫ్ఐ నాలుగో జిల్లా మహాసభలను ఈ నెల 12, 13వ తేదీల్లో భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వనం రాజు తెలిపారు. మంగళవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పోరాటాలు చేస్తున్నది ఎస్ఎఫ్ఐ మాత్రమేనన్నారు. సమావేశంలో నాయకులు లావుడ్య రాజు, అన్నంపట్ల రమణ, శివాణి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ

మోత్కూరు : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బుర్రు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరులో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల 4వ మహాసభలో ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం, పాఠశాలలు, కళాశాల్లో తగిన మౌలిక వసతులు, బోధనా సిబ్బంది నియామకం కోసం విద్యార్థులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వంశీకృష్ణ, ఇంజ ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, మడికంటి అనిల్, సంపత్, విష్ణు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి శంకరాచారి సన్మానం

చౌటుప్పల్, ఏప్రిల్ 2: బహుజన సమాజ్ పార్టీ నుంచి భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరిన మునుగోడు నియోజకవర్గ నాయకుడు అందోజు శంకరాచారి మంగళవారం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ భువనగిరి నియోజకవర్గం పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్ , గీతకార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బరిగెల అశోక్, రాణి, గండు నాగేంద్ర బాబు, గడ్డం కృష్ణ, చిలకరాజు శివ, ఊదరి అంజన్, గడ్డం ముత్యాలు, మహేందర్, ఏర్పుల క్రాంతి పాల్గొన్నారు.

శిఖర ఆర్ట్స్ నంది పురస్కారం

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 2: చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన పోలేపల్లి ధీరజ్, పోలేపల్లి శివరామ్‌లు శిఖర ఆర్ట్స్ వారి నంది పురస్కారాన్ని అందుకున్నారు. అమరుడైన సైనికుడు పాటకు సంబంధించి బెస్ట్ కొరియోగ్రాఫర్, బెస్ట్ కెమెరా మెన్‌గా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో దైవజ్ఞశర్మ నుంచి నంది పురస్కారంను అందుకున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం

ఆలేరు రూరల్, ఏప్రిల్ 2: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన సోమవారం అర్ధరాత్రి ఆలేరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక భరత్‌నగర్‌లో నివాసం ఉండే అందె చంద్రమౌళి రాత్రి భోజనానంతరం తమకున్న రెండు ద్విచక్ర వాహనాలను ఇంటి ఎదుట పార్కు చేశాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు వాహనాలకు నిప్పు పెట్టారు. తెల్లవారు జామున లేచి చూడగా రెండు వాహనాలను దగ్ధమై ఉన్నాయి. ఈ విషయమై ఆలేరు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుట్టలో గంజాయి కలకలం

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 2: నిలిపి ఉన్న ద్విచక్రవాహనంలో గంజాయి ప్యాకెట్లు లభించడంతో యాదగిరిగుట్ట పట్టణంలో కలకలం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శ్రీరాంనగర్‌లో గత ఆదివారం రాత్రి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్నఖాళీ ప్రదేశంలో నెంబర్ లేని నూతన హోండాయాక్టివాను గుర్తుతెలియని వక్తులు వదిలివెళ్లారు. అంతకు ముందు ఆ వ్యక్తులు ఇంటి వద్ద పార్కింగ్ చేసిన రమేష్, ఉమేష్ స్థానికుల ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ తీసినట్లు సీసీపుటేజ్‌లో నమోందైంది. యాక్టివా మాత్రం తాళం చెవితో పాటుగా అక్కడనే ఉంది. దీంతో స్థానికులు మంగళవారం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వాహనాన్ని పరిశీలన చేయగా నెంబర్‌ప్లేట్ లేదు. వాహనం వద్ద ఉన్న బ్యాగ్ తెరిచే సరికి అందులో మూడు గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సింది.